

శ్రీ ప్రణవ పీఠము
सत्यं वद-धर्मं चर



# శ్రీ ప్రణవ పీఠాధిపతి, త్రిభాషామహాసహస్రావధాని

# బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు

# శ్రీ హనుమంతుని తులాభార ఘట్టము

సేకరణ: గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానము, సంపత్ నగర్, గుంటూరు నందు ప్రవచించిన శ్రీ హనుమద్వైభవము నుండి

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

ఓం శ్రీ గణేశాయ నమః

సీతారామ, రఘుపతిరామ, దశరథరామ, పట్టాభిరామ, కోదండరామ

శ్రీ హనుమాన్ జయ హనుమాన్ జయ జయ హనుమాన్

శ్రీరాముడు పట్టాభిషిక్తుడై అయోధ్యను పరిపాలిస్తున్న కాలంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో కాలం గడుపుచూ, రామనామంతో తరిస్తూ, రాజ్యం అంతా రామ నామమయంగా నిండిపోయింది. ఎంత గొప్ప రాజ్యం అయినా చంద్రునిలో ఒక మచ్చయున్నట్లు రాజ్యం లో కొంత మంది పన్నులు కట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు కూడా యున్నారు. రాముడు అరణ్యవాసం చేసిన 14 సంవత్సరములు భరతుడు “రామ పాదుకలు” ఒక పీఠంపై పెట్టి లెక్కలు అన్ని ఆ రామపాదుకలకు సమర్పించేవాడు. శత్రుఘ్నుడు పన్నులు వసూలు చేసిన లెక్కలను భరతునికి అప్పజెప్పేవాడు. ఈ విధముగా రాముని అరణ్యవాస కాలం లో భరతుని పరిపాలనా విధానము కొనసాగుతూ యుండెడిది. అయోధ్యా వాసులు, ఇతర చుట్టుపక్కల వారు సక్రమముగానే పన్నులు చెల్లించేవారు. కానీ రెండు రాజ్యాలవారు మాత్రం ఈ 14 సంవత్సరములు అసలు పన్నులు చెల్లించనేలేదు. వారిలో ఒకరు మద్ర దేశాధీశులు, రెండవవారు కాంభోజ రాజ్యం వారు. వీరు ఏదో నామమాత్రపు కొద్ది పన్ను మాత్రమే చెల్లించేవారు. కానీ చాలా పెద్ద మొత్తంలో ఇంకా పన్ను చెల్లించవలసి యున్నది.

అగస్త్య మహర్షి వారి సూచన:-

ఆ కాలంలో ఒక రోజు అగస్త్య మహర్షి వచ్చి, రామా! నీ రాజ్యం లో సంపదలకు, సుఖ సంతోషాలకు లోటులేదు. సాక్షాత్తుగా జగన్మాత అయిన ఆదిలక్ష్మి జానకీమాత కనుక ఆదిదేవుడవు నీవు కనుక, ఈ అయోధ్యకు నీ పరిపాలనలో ఏ లోటూ రాదు. మీ ఇద్దరి నీడలో ఈ దేశ ప్రజలందరూ ధన, ధాన్య, కనక, వస్తు వాహనములతో సంతోషముగా యున్నారు. అయినా కాంభోజ, మద్ర దేశం నుండి రావలసిన పన్ను బకాయిలు సంవత్సరాల తరబడి బకాయిలాగే ఉండిపోయింది. వారు 14 సం|| ల నుండి పన్ను కట్టక పోయినా, నీవు ప్రజలందరికీ సమానంగానే సౌకర్యాలు కల్పిస్తున్నావు. పన్నులు కట్టలేదని ఒకరిని ఎక్కువగా, ఒకరిని తక్కువగా నీవు చూడటం లేదు. ఎందుకంటే నీవు పరమ దయాళువు, కరుణా స్వరూపడవు. కానీ దేశంలో ప్రజలు పన్నులు కట్టకపోతే వాటిని సక్రమముగా వసూలు చేసే బాధ్యత కూడ ఆ రాజుదే. వారిని నీవు క్షమించినట్లయితే వారిలో నిర్లక్ష్యం పెరిగి, రాజు పన్నులు కట్టకపోయినా మనలను ఏమీ చేయడు అనే దుర్భావన ప్రజల మనస్సులలో ఏర్పడుతుంది. కావున, రామా! నీవు ప్రజల నుండి వారు కట్టవలసిన పన్ను వసూలు చేయవలసినది అని అగస్త్య మహర్షి శ్రీరాములవారికి సూచన చేశారు.

అప్పుడు శ్రీరాములవారు చిరునవ్వుతో స్వామీ! మీరు చెప్పింది సరి అయినది, కానీ ఇప్పటికే 14 సంవత్సరాలు గడచిపోయినాయి. కావున ఇక నుండి వారి వద్ద నుండి పన్నులు సక్రమంగా వసూలు చేసే బాధ్యతని నేను తీసుకుంటాను అని సమాధానమిచ్చారు. అప్పుడు అక్కడే యున్న వశిష్ట మహర్షులవారు వెంటనే లేచి, ఓ రామా! నీవు కరుణా స్వరూపుడవు కావున అలా పలుకుచున్నావు. "కానీ చేసిన అపరాధము స్వల్పము అయిన భయంకరమైన దోషాన్ని మానవుడికి ఇస్తుంది. అలానే, చేసిన కొద్దిపాటి పుణ్యం అయినా గొప్ప భయము నుండి రక్షిస్తుంది". పుణ్యం అయినా, పాపం అయినా ఎంతో కొంత మానవులు తప్పక అనుభవించవలసిందే కావున నీవు ఇప్పుడు 14 సంవత్సరాల నుండి వారు కట్టవలసిన పన్నులు ఎగవేత అను దోషమునకు, తగిన ప్రాయశ్చిత్తము వారికి విధించకపోతే వారు నరకానికి పోతారు. వారు నరకానికి పోతే మళ్ళీ ఆ బాధ్యత రాజుదే. కావున రామా! నీవు వారినుండి పన్నులు వసూలు చేసి, వారిని నరక బాధ నుండి తప్పించు అని వశిష్ట మహర్షులవారు శ్రీరామునికి తెలియజేసినారు.

ఈ విషయం రాములవారికి తెలియక కాదు, దయాసముద్రుడు, ధర్మాత్ముడు కనుక అలా అన్నాడు. సరే, పన్నులు ఎలా వసూలు చేస్తారు అని సభలోని వారు అన్నారు. శ్రీరాముల వారు చిరునవ్వు నవ్వుతూ ఆ బాధ్యత అంతా హనుమంతుల వారి మీద పెడుతున్నాను

అన్నారు. వెంటనే ఆ వార్త కాంభోజ, మద్ర దేశాలవారికి పంపబడినది. ఓ కాంభోజ దేశాధీశులారా! ఓ మద్ర దేశాధీశులారా! మా వారు మీ వద్దకు ఒక త్రాసు పట్టుకు వస్తారు మీరు అందులో చెల్లించవలసిన పన్ను బంగారం రూపంలో చెల్లించండి అని అయోధ్యా నగరము నుండి ఒక వార్త వారికి పంపించటము జరిగినది. మా వారు ఓడలద్వారా సముద్రంలో ప్రయాణించి, ఒంటెలు, ఏనుగులు తీసుకువస్తారు. వాటితోపాటు ఒక త్రాసు కూడా తీసుకువస్తారు. మీరు ఆ కాటాలో మీరు చెల్లించవలసిన పన్ను బంగారంరూపం లో చెల్లించండి అని శ్రీరాముల వారు ఆదేశించారు.

శ్రీరాముల వారి ఆదేశానుసారము హనుమంతుల వారు ఆ రెండు దేశాలకూ వెళ్ళి, ఆ నగర మధ్యలో ఒక కాటా యుంచి అందులో ఒకవైపు ఒక నిమ్మకాయను యుంచారు. రెండవ వైపు వారు చెల్లించవలసిన పన్నులు బంగారం రూపంలో యుంచమన్నారు. ఎవరు ఎంత పన్ను చెల్లించాలి అనే విషయాన్ని ఆ నిమ్మకాయ చూసుకొంటుంది. మీరు మాత్రం ఈ 14 సంవత్సరముల నుండి చెల్లించవలసిన పన్ను బంగారం రూపంలో ఆ కాటాలో రెండవవైపు యుంచండి అని నిర్ణయించారు.

ముందుగా మద్రదేశములో ఈ విషయమును చాటింపు వేసి నగరం మధ్యలో ఈ కాటాను వ్రేలాడదీశారు. ముందుగా ఒక పెద్దాయన పన్ను చెల్లించుటకు కాటా వద్దకు వచ్చి, కాటాలో ఒకవైపు నిమ్మకాయ యుండగా రెండవవైపు తను చెల్లించవలసిన పన్నును బంగారం రూపం లో యుంచాడు. కాని కాటా కొద్దిగా కూడ తూగలేదు. ఆ పెద్దాయన 14 సంవత్సరాల నుండి పన్ను చెల్లించాలి. ఆశ్చర్యపోయిన ఆ పెద్దాయన చిన్న నిమ్మకాయ ఇంత బరువు యున్నది? ఏమిటి అని మరలా తిరిగి యింటికిపోయి 4 గుమ్మడికాయల బంగారం తెచ్చి కాటాలో యుంచాడు. అయినా కాటా ముల్లు కొద్దిగా కూడా వెనక్కి తగ్గలేదు. అతను మరింత నివ్వెరపోయాడు, ఇది ఏమిటి వింతగా యుంది? ఒక చిన్న నిమ్మకాయ ఇంత బరువు యుండుట ఏమిటి అని ఆశ్చర్యపోతూ మరింత బంగారం తెప్పించి కాటాలో వేశాడు. అలా 85 క్వింటాళ్ళు బంగారం కాటాలో వేస్తేనేగాని ఆ కాటాముల్లు సరితూగలేదు. అంటే అతను 14 సంవత్సరముల నుండి అంత బంగారం పన్నురూపంలో కట్టవలసియున్నది.

దానిని హనుమంతులవారు ధర్మదేవత అవతారములో ఆ నిమ్మకాయలో ప్రవేశించి, ప్రజలు శ్రీరాములవారికి 14 సంవత్సరాల నుండి పన్ను బకాయిలు ఎంత చెల్లించవలయునో అంత ఆ కాటాలో యున్న నిమ్మకాయలో యుండి వసూలు చేశారు. ఇంత పన్ను చెల్లించాను అని ఆ పెద్దాయన బాధపడలేదు. నా పన్ను 14 సంవత్సరాల బకాయి యింతటితో తీరిపోయింది, దీనితో నా పాపం కూడ పోయింది అని సంతోషించి, శ్రీరాముల వారి రాజ్య

పరిపాలనా విధానము ఎంత బాగుంది అనుకుంటూ రాముల వారికి నమస్కరించాడు. ఇది చూసిన వేరొక వ్యక్తి 85 క్వింటాళ్ళు బంగారం ఇస్తే గాని తూగని ఈ కాటా లో నేను ఎంత చెల్లించాలో అనుకుంటూ, భయపడుతూ తన చేతి వ్రేలికున్న బంగారు ఉంగరాన్ని కాటాలో యుంచాడు. అంతే ఆ కాటా టక్కున సరితూగినది. అమ్మయ్య! బ్రతుకుజీవుడా అని ఆ వ్యక్తి అక్కడ నుండి నిష్క్రమించాడు. ఇది చూసిన ఆశ్చర్యపోయిన ప్రజలు బారులు తీరి వరుసలో నిల్చుని తాము 14 సంవత్సరాల నుండి ఎంత పన్ను చెల్లించాలో, అంత బంగారం రూపంలో త్రాసులో యుంచగా నిమ్మకాయలో ధర్మదేవత రూపంలో రెండవ వైపు కాటాలో యున్న హనుమంతులవారు వారి నుండి 1 కిలో, 2 కిలోలు, 3 కిలోలు, 4 కిలోలు, 5 కిలోలు ఎవరు ఎంత పన్ను బకాయిలు పడ్డారో అంత బంగారాన్ని శ్రీరాముల వారి ఆదేశానుసారము ప్రజలనుండి వసూలు చేసిన మొత్తాన్ని అయోధ్యానగరమునకు చేర్చి, కోశాగారాన్ని బంగారంతో నింపేశాడు. ఇది చూసిన సీతారాములు హనుమంతులవారిని నిండుగా దీవించారు.

ఈ విధముగా హనుమంతులవారు శ్రీరాముని ఆదేశానుసారము ప్రజలనుండి పన్నులు వసూలు చేయటానికి తనకు తానై కాటాలో తులాభారము తూగినారు కాబట్టి ఈ కథకు "హనుమంతుని తులాభారం” అని పేరు వచ్చింది.

## రెండు దేశాలవారూ ఆభినందన లేఖలు పంపుట:

ఈ విధంగా కాంభోజ రాజ్యము వారు, మద్ర రాజ్యము వారు పన్ను చెల్లించి, ఓ రామా! నీ రాజ్యంలో ధర్మం నాలుగు పాదములపై నడుస్తూ యున్నది. దానికి ఈ సంఘటనే నిదర్శనం. కావున మీకు మా అభినందనలు తెలియజేస్తున్నాము. ఓ రామా, మీరు ఎవరి వద్ద నుండి కూడా ఎక్కువ పన్ను వసూలు చేయలేదు, అలా అని తక్కువ పన్ను వసూలు చేయలేదు. ఎవరూ దీనికి బాధపడటం లేదు. అందరూ ఇది ధర్మమే అని అభిప్రాయపడుతున్నారు అంటూ, వారు అభినందన లేఖలు శ్రీరాముల వారికి పంపారు. ఇది శ్రీరాముల వారి పరిపాలన లోని వైశిష్ట్యం.

## ఫలశ్రుతి

ఈ హనుమంతుని తులాభార ఘట్టము విన్నవారు ఎవరికి అయిన వ్యాపారంలో ఒడిదుడుకులు ఉంటే భక్తి శ్రద్ధలతో ఈ పారాయణ చేసిన మూడే మూడు రోజులలో వ్యాపారం తిరిగి అభివృద్ధి చెందినవారు యున్నారు.

## సోదాహరణముగా ఒక యదార్థ ఘటన:

ఈ పారాయణం చేసినవారికి సత్యంగా కలిగిన ఒక అనుభవం. గురువుగారు చెప్పిన ఒక యదార్థ సంఘటన:

గణపవరం లో ఒక కిరాణా వర్తకుడు ఉండేవాడు. అతని కిరాణా వ్యాపారం బాగా దెబ్బతిన్నది. ఆత్మహత్య కూడా చేసుకొందామన్నంత పరిస్థితి. అటువంటి దిక్కుతోచని నిస్సహాయ పరిస్థితులలో ఆ వర్తకుడు గురువు గారి తండ్రి గారిని కలిసి తన నిస్సహాయ, దీన స్థితిని చెప్పుకున్నాడు. అప్పుడు గురువు గారి తండ్రి గారు మన గురుదేవులను (బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారిని) ఈ హనుమంతుని తులాభార ఘట్టమును ఆ వర్తకుడి కిరాణా దుకాణంలో 3 రోజులు పారాయణం చేయమని ఆదేశించారు. కిరాణా వర్తకుడు పద్మాకర్ గారిని చిన్న గురువుగారు అని పిలుస్తుండేవాడు. పూర్వం గురువుగారి చిన్నతనంలో ఈ వర్తకుని దుకాణం లో సామాన్లు కొనుగోలు చేసేవారు, అప్పుడు అతను చిన్నవారైన మన గురువుగారి మీద అభిమానంతో కొద్దిగా బెల్లం కూడా సమర్పించుకుంటూ ఉండేవాడు. గురువుగారి తండ్రిగారు ఆ వర్తకునితో భయపడకు, ఉదయాన్నే స్నానం చేసి షాపుకు వెళ్ళి, ఒక ఆంజనేయ స్వామివారి ఫోటో పెట్టి, హారతి ఇవ్వు, ఈ హనుమంతుని తులాభార ఘట్టాన్ని మా అబ్బాయి 3 రోజులు పాటు పారాయణం చేస్తారు, అలా చేస్తే అన్ని ఒడిదుడుకులు పోయి తప్పక వ్యాపారాభివృద్ధి జరిగి తీరుతుంది, అని పెద్దలు చెప్పారు. ఎటువంటి దుర్భర పరిస్థితులలో అయినా, ఈ హనుమంతుని తులాభార ఘట్టం శ్రవణం చేసినవారు తప్పక ఆ పరిస్థితులనుండి బయటపడతారు అని పరాశరుల వారు మైత్రేయ మహామునుల వారికి వివరించారు, అని చెప్పారు.

## పారాయణ చేయు విధానము:

ఒక ఆంజనేయ స్వామి వారి ప్రతిమ లేదా పటమును పెట్టుకొని ముందుగా హారతిచ్చి, ఈ కథను శ్రవణం చేసిగాని, లేక పఠనం చేసిగాని పారాయణం పూర్తి అయిన తరువాత, చిన్న బెల్లం ముక్క నైవేద్యం పెట్టాలి. ఈ విధముగా మూడు రోజులు పారాయణం చేయాలి. తప్పక మీరు వ్యాపారాభివృద్ధి సాధించి తీరుతారు.

గమనిక:

వ్యాపారంలో నష్టం వచ్చినా, నష్టపోయే పరిస్థితులు ఉన్నా, ఈ శ్రీ హనుమత్ తులాభారము ను మూడు రోజుల పాటు మీ వ్యాపార సంస్థలలో పారాయణం చేయండి లేదా పారాయణం చేయించండి లేదా మననం చేసుకోండి. ఆ తరువాత కలిగే మార్పులు మీరే చూడవచ్చు అని పరాశర సంహిత చెబుతుంది. మన గురువుగారి పితృదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి చలపతి రావుగారు దివాలా తీసిన సంస్థలలో, దివాలా తీసిన వ్యాపార కేంద్రాలలో పూర్వం ఈ కథను చెప్పించేవారు.

ఆ వర్తకుని దగ్గర ప్రతిరోజూ ఉదయం 3 రోజుల పాటు మన గురుదేవులు పారాయణం చేయగా, తప్పక మేలు జరుగుతుందనే నమ్మకంతో శ్రద్ధగా విన్నాడు. రోజూ పారాయణం పూర్తి అయిన తరువాత స్వామివారికి కొద్దిగా బెల్లం నైవేద్యంగా సమర్పిస్తుండేవాడు. తరువాత ఆ బెల్లాన్ని ప్రసాదంగా స్వీకరించేవాడు.

ఏమి విచిత్రం జరిగిందో ఏమో తెలియదు గాని, ఒక అద్భుతం జరిగినట్లుగా పూర్తిగా దివాలా తీసిన కిరాణా వ్యాపారం పూర్తిగా అభివృద్ధి లోనికి వచ్చినది. అద్దె షాపులో ఉండే ఆ కిరాణా వర్తకుడు మెల్లమెల్లగా అభివృద్ధి చెంది, స్వతంత్రంగా ఒక అంగడి నిర్మించుకొని గొప్ప వర్తకునిగా మంచి పేరు తెచ్చుకున్నాడు. ఇది హనుమంతుని తులాభార ఘట్టములోని వైశిష్ట్యం మరియు పారాయణం ఫలము.

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

బలం విష్ణోః ప్రవర్ధతాం, బలం విష్ణోః ప్రవర్ధతాం, బలం విష్ణోః ప్రవర్ధతాం

బలం గురోః ప్రవర్ధతాం, బలం గురోః ప్రవర్ధతాం, బలం గురోః ప్రవర్ధతాం

★★★★★సమస్త లోకాః సుఖినో భవంతు★★★★★